# పరిష్కారం

-పిడుగు పాపిరెడ్డి

సముద్రంలోనే కాదు, సంసారంలో కూడా ఉంటాయి సుడిగుండాలు. కాళ్ళు తడవకుండా సప్తసాగరాలు దాటవచ్చు కాని కళ్ళు తడికాకుండా సంసార సాగరాన్ని దాటలేమనే సూక్తి అక్షరసత్యం. సాగరంలో మాదిరే సంసారంలో కూడా తుపానులు, సునామీలు వస్తూనే ఉంటాయి. ముందు చూపు ఉన్నవాళ్ళు కొద్దిపాటి నష్టంతో బయటపడ్తారనేది అనుభవం నేర్పిన గుణపాఠం.

అప్పుడే ఇంట్లో కాలుపెట్టిన రామారావుకు యుద్ధానంతరం జయాపజయాలు తేలని శత్రువుల్లా రుసరుసలాడుతూ కన్పించారు అన్నపూర్ణమ్మ, అనంత లక్ష్మి. రామారావు రాకతో తాత్కాలికంగా యుద్ధ విర మణ చేసి పంచలోకి ఒకరు, వంట ఇంట్లోకి ఒకరు ఉపసంహరించుకున్నప్పటికీ శాంతియుత వాతావర ణం ఏర్పడలేదనే దానికి సాక్ష్యంగా వారి చీరాకులు, చీత్కారాలు విన్పిస్తూనే ఉన్నాయి.

హాలులో కూర్చొని ఆలోచనలో పడ్డాడు రామా రావు. అత్త ఎంత ఉత్తమురాలైనా, కోడలు ఎంత గుణ వంతురాలైనా, జాతి వైరంలా వారి మధ్య పోరాటం అనాదిగా కొనసాగుతూనే ఉంది. ఇది అత్తా కోడళ్ళ ఆధిపత్య పోరు. విజేత తేలేదాకా వదలరు.

అమ్మ మంచిదే. మనుమడు పుట్టినప్పుడు, కోడలు జబ్బు పడ్డప్పుడు వచ్చి బాగోగులు చూచి వెళ్ళేది. వయస్సు పైబడి తిరగలేని స్థితిలో, ఉన్న ఊరి నుంచి కొడుకు ఉద్యోగం చేసే ఊరికి వచ్చింది. మనుమడితో ఆడుకుంటూ కాలం గడపాలనేది ఆమె ఆపేక్ష. అనంత లక్ష్మి కూడ ఆనందంగానే ఆహ్వానించింది. ఆ తర్వాత ఏమైందో కాని వారిద్దరూ ఎడమొగం, పెడమొగంగా తయారయ్యారు. ఆకాశం మేఘావృతమైనట్టు మొఖాలు ముడుచుకుని తిరిగేవారు. ఆ తర్వాత ముసురుగా ప్రారంభమై, జడివానగా మారి, వాయుగుండంగా తయారైంది.

"అమ్మా నువు ఓర్చుకో" అన్నాడు రామారావు.

"నావల్ల కాదురా, ఎంత ఓర్చుకున్నా ఆ అమ్మా యికి అర్థం కావడంలేదు" అన్నది అన్నపూర్ణమ్మ.

అత్తా కోడళ్ళ సమస్యలను గురించి, వాటి పరి ష్కారాల గురించి అనేక పుస్తకాలు చదివాడు రామా రావు. అనేకమంది మేధావులను కలుసుకుని వారి అనుభవాలను ఆకలింపు చేసుకున్నాడు. ఈ సమస్యను క్షుణ్ణంగా శోధించి భార్యకు గీతోపదేశం చేశాడు.

"తెలివిగల్ల కోడలు ముందు తాను ఓడి అందరిని గెలుస్తుంది. లౌక్యం తెలియని కోడలు ముందు తాను గెల్చి అందరి చేతిలో ఓడిపోతుంది" అని.

"అంత తెలివి నాకు లేదులే" అన్నది భార్య.

అమెరికాకు, అల్‌కాయిదాకు అయినా రాజీ చెయ్యవచ్చు కాని అత్తాకోడల్లను సఖ్యపెట్టడం సాధ్యం కాదని తేలింది. అత్యవసర పరిస్థితులలో అధినాయ కులు, అధికార్లలా తాత్కాలికంగా యోగనిద్రలోకి వెళ్ళడం మొదలుపెట్టాడు రామారావు. వయస్సు పైబడడం వల్ల అన్నపూర్ణమ్మ, వయ్యారంగా పెరగడం వల్ల అనంతలక్ష్మి అరచుకోవడంలోనే అలసిపో తున్నారు కనుక వారి పోరాటం హింసాత్మకంగా మార

## ఎందుకనుకోడు???

ఉదయించే తొలికిరణం అనుకుంది
తానే ఈ భువినిండా వెలుగులు నింపాలని
పుడమిని చేరే ప్రతీ వానచుక్క అనుకుంది
కర్షకులందరికి తానే ఆధారమవ్వాలని
భూమిపైనున్న ప్రతి చెట్టూ అనుకుంది
తానే ఈ శతకోటి జనావళికి
ప్రాణవాయువునందించాలని
సెలయేరులోని ప్రతీ నీటిబిందువు అనుకుంది
తానే సమస్త ప్రాణుల దాహం తీర్చాలని
కోకిల గానం అనుకుంది
తన తీయటి రాగాలతో
అందరికీ వీనుల విందు చేయాలని
మొగ్గలు తొడిగే ప్రతీ పూబాల అనుకుంది
తను వాడకముందే
భగవానునికి అర్పితం కావాలని
మరి... / ఈ భువిలోని ప్రతి మనిషి
ఎందుకనుకోడు???
తోటివారికి సహాయపడాలని!!

-ఎస్.వి.ఎస్.ఎస్.ప్రభాకరాచార్యులు

దంలేదు.

పంచలో పాత మంచం మీద అడ్డంగా పరచిన బొంత మీద కూర్చుని చీదుకుంటూ చింతపడుతూ ఉంది అన్నపూర్ణమ్మ. "దీనికేమైంది? ఏమన్నానని నా మీద ఇంతగా విరుచుక పడుతోంది. సంప్రదాయమైన పిల్ల, చదువుకున్నది, కొడుకు సుఖపడ్తాడని కోరి చేస్తే ఇది కొంపకు తిప్పలు తెస్తుంది. అత్తగారింటి పద్ధతులు అర్థం చేసుకో, కోడలే ఇంటికి కీర్తి తెచ్చేది అంటే అది చాదస్తమా! మంచి చెప్తే అది అత్త పెత్తనమా! అత్తింటి కీర్తికి మెరుగులు పెడుతుంది అనుకుంటే కుక్కలా మొరగడం మొదలుపెట్టింది. కంటిపాపలా చూచుకుంటుంది అనుకుంటే కంట్లో నలుసులా తయారైంది. వాడొక పిచ్చినాగన్న. దీని దెబ్బకు తట్టుకోలేక వాడు బుద్ధుడిలా తయారయ్యాడు. దీని సంగతేదో తేల్చుకోవాలి."

వంటింట్లో అనంతలక్ష్మి అంతరంగం పొయ్యి మీద పొంగలిలా గుడగుడ ఉడుకుతుంది. "ఏదో ముసలి ముండ, కృష్ణా, రామా అనుకుంటూ పడి ఉంటదిలే అనుకుంటే నామీదే పెత్తనం చేయాలని చూస్తుంది. నేనెవర్ని? పులి వీరన్న బిడ్డను. పుట్టింది రైతు ఇంట్లోనైనా పెరిగింది, చదివింది టౌనులో. అందులో మా పెదనాయన పోలీసు వెంకటస్వామి ఇంట్లో. కన్నోళ్ళే నాకు ఎదురు చెప్పరు. ఇది నాకు నీతులు చెప్తుంది. నేనేదో మంచిదాన్ని కనుక అత్తను ఇంట్లోకి రానిచ్చినా. అసలిప్పుడు అత్తగారింటికి పొయ్యేవాళ్ళు లేరు. అత్తామామలకు సేవలు చేసే కాలం పోయింది. పెళ్ళికాగానే మొగునికి ముక్కుతాడేసి లాక్కపోయి అత్తగారింటికి పక్కనే కొత్తకాపురం పెట్టే రోజులివి. ఆ సంగతి ఈ ముసలిదానికి తెలిసినట్టు లేదు. అమీతుమీ ఈవేళ తేల్చుకోవాలి."

మరుసటి రోజు ఉదయం రామారావు అటు ఆఫీసుకు వెళ్ళగానే ఇటు ప్రత్యర్థులు ఇద్దరు యుద్ధానికి సిద్ధమయ్యారు. ఇద్దరు వేడి మీద ఉన్నారు గనుక రాజేయకుండానే అంటుకుంది.

"ఈ శని వదిలితేగాని సుఖపడం" ప్రార్థనా గీతం పాడింది అనంతలక్ష్మి.

"శని వదిలినా నువు సుఖపడవే. ముప్పైయేళ్ళు కష్టపడి మొక్కను మానును చేస్తే నువ్వు ఇవ్వాళ మానెక్కి కులుకుతున్నావు. వాన్ని కొంగున కట్టుకుని కన్నోళ్ళను ఏడిపిస్తున్నావు. నీవేమి సుఖపడతావ్?" పల్లవి అందుకుంది అన్నపూర్ణమ్మ.

## జీవధార

తెలుగు అక్షరాల నీటి ఊట
నిలువచేసి దాచుకుంటి
బుజ్జిమేఘం నిండుగా!
కారుమబ్బులు కమ్మి హృదయం
పొంగి కదులుతు ఉరకలేయగా!
స్పందించిన మనసు మురిసి
తీగ మెరుపులు మెరవగా!
స్వరం ఉరుముతు నాదమై!
అక్షరాల నీటి ధార / జల్లులై పెదవుల్లో రాలగా!
వెల్లువై వాక్యాల వరద / కవితలై పొంగుతుంది!
　అక్షరాల వరద పొంగు
　జీవనదిలా సాగిపోతూ...
　జానపదుల గొంతు తడిపి
　జాగృతం చేసి సాగే!
తెలుగు లోగిళ్ళు దాటుకుంటూ
నుడికారపు యాసల్లో
మాండలికాల పాయలుగ వీడే!
వయ్యారాల ఉరకలేస్తూ...
వ్యవహారాల పలుకుబడిలో
వ్యవహారికపు పరుగులు దాసే!
　గ్రాంథికపు పాయను వీడి
　ప్రామాణికపు పాఠాల్లో
　పల్లవిగా పారుతుండే!
ఏ తెలుగువాడు / ఈ జీవధారకు
భగీరథుడుగ మారెనో?!
కల్మశంలేని అక్షరధార
తెలుగు గొంతుల్లో పల్లవించే!
శ్రావ్యగానమై భాషల్లో/తెలుగు అక్షరధార వర్ధిల్లే!
　కాలుష్యపు ఆంగ్ల వరద
　కలిసిపోయి నాటి నుంచి
　తెలుగు అక్షరాల జీవనది
　విషతుల్యపు గంగగా మారే!
　తెలుగు అక్షరాల నీటిధార
　కానరాదు తెలుగునాట/మేలుకొని మనమంతా
　కాలుష్యపు ఆంగ్ల వరద / కట్టుకట్ట నిర్మిస్తే
　బతుకుతుంది తిరిగి మళ్ళీ
　తెలుగు అక్షరాల నీటిధార
　సుధామధుర జీవధార!!

—ఆకుల రాఘవ

"మా సంసారం చట్టుబండలు చెయ్యాలని కంకణం కట్టుకున్నావు. ఇంక మేమేమి సుఖపడతాం" తారస్థాయిలో అరిచింది అనంతలక్ష్మి.

"నేను కాదే విడదీసేది, పేగుబంధం తెంచి తల్లి కొడుకులనూ విడదీసేది నువ్వే" బావురుమంది అనంతలక్ష్మి.

"తల్లి కొడుకుల విడదీసిన నింద నాకెందుకు? నే వెళ్తా, మీరు హాయిగా ఉండండి" అన్నది అనంతలక్ష్మి.

"కొడుకు కాపురం కూల్చడం ఎందుకు! నేనే వెళ్తా, మీరే హాయిగా ఉండండి" అన్నది అన్నపూర్ణమ్మ.

ఇద్దరు రామారావుకు ఇంటిమేషన్ ఇచ్చి వెళ్ళిపోయారు.

❖ ❖ ❖

మంచంలో ఉన్న అమ్మమ్మ చుట్టూ తిరుగుతూ ఆడుకుంటున్నాడు అనంతలక్ష్మి ఐదేళ్ళ కొడుకు వాసు.

"ఒరే వాసూ, నా కూతురిని చేసుకోరా" అంది అనంతలక్ష్మి పెద్దవదిన నవ్వుతూ.

"ఉహూ, నేను చేసుకోను"

"ఏం పిల్లోడా! నా కూతురికేం బంగారు బొమ్మ. శ్రీదేవిలా అందంగా ఉంటది."

ఇంతలో చిన్న వదిన అందుకొంది, "అయితే నా కూతురిని చేసుకోరా అల్లుడా, రంగు తగ్గినా అచ్చం రంబలా ఉంటది"

"ఉహూ, నేను ఎవరినీ చేసుకోను"

"ఏం, ఎందుకని?"

**"నాకు మా అమ్మంటే ఇష్టం. పెళ్ళి చేసుకుంటే అమ్మ ఉండదుగా"**

అందరూ నిశ్చేష్టులయ్యారు. ముసలామె దగ్గుతూ లేచి కూర్చుంది. పెద్దకోడలు మాత్ర ఇస్తే, చిన్న కోడలు మంచినీళ్ళు ఇచ్చింది. అనంతలక్ష్మి లేచి మౌనంగా ఇంట్లోకి వెళ్ళింది.

❖ ❖ ❖

దీపావళి పండగకు రామారావుకు రెండు రోజులు సెలవు దొరికింది. రామారావు ఆలోచనలో పడ్డాడు. పండుగ పేరుమీదనైనా అత్తగారింటికి వెళ్ళి అనంతలక్ష్మిని మెత్తపరచుకోవాలి. మంచి కొడుకును ఎటూ కాలేకపొయ్యాను. మంచి భర్తగానైనా ఉందాం. అమ్మను అనాథాశ్రమంలో చేర్చినా పరవాలేదు. నమ్ముకున్న ఆలుబిడ్డలను వదిలిపెడితే లోకం ఊరుకోదు. అమ్మ అష్టకష్టాలలో ఉన్నా బిడ్డలను ద్వేషించదు. సుఖంగా ఉండాలని ఆశీర్వదిస్తుంది. ఒడ్డు చేరక ముందే తెడ్డు విసిరేస్తే చేతగానోడు చేసుకోవడమెందుకని జనం దుమ్మెత్తిపోస్తారు.

ఒక ధృఢ నిర్ణయానికి వచ్చిన రామారావు అత్తగారింటికి బయలుదేరడానికి తలుపు వేసి వెనుదిరిగాడు.

అన్నపూర్ణమ్మను రిక్షాలో నుంచి చేయిపట్టి దించి ఇంట్లోకి తీసుకువస్తుంది అనంతలక్ష్మి. ఇది కలా, వైష్ణవ మాయా అర్థంకాక శిలలా నిలబడిపోయాడు రామారావు.

"ఏమో అనుకున్నా గాని నా కోడలు బంగారం" పంచలో మంచం మీద కూర్చుంటూ అన్నది అన్నపూర్ణమ్మ. భర్తకొక మందహాసం అందించి కొడుకును గుండెలకు హత్తుకుంటూ ఇంట్లోకి వెళ్ళింది అనంతలక్ష్మి.

రామారావుకు ఆనందంతో ఊపిరి ఆడ్డంలేదు. దీపావళి వెతుక్కుంటూ తన ఇంటికి వచ్చినట్లుంది. తన ఇల్లే కాదు దేశమంతా దీపావళిలా వెలిగిపోతుంది. చిచ్చుబుడ్డిలా ఒక ఆలోచన మెదడులో నుంచి తన్నుక వచ్చింది.

**"తల్లిని ప్రేమించాల్సింది కొడుకులే కాదు, కోడళ్ళు కూడా. దేశాన్ని ప్రేమించాల్సింది దేశీయులే కాదు, దేశంలోకి వచ్చి స్థిరపడ్డవాళ్ళు కూడా."** ■

## వీడ్కోలు!

స్నేహ కెరటాల తీరం నుండి
క్రొత్త ప్రస్థానానికి
సాదరంగా...
సాగనంపేది వీడ్కోలు!
అది...
ఆత్మీయ ప్రకటనకు ప్రతీక!
అల్లుకుపోయిన / అనుబంధాల జ్ఞాపిక!
గుండెలో...
గూడుకట్టుకున్న
ఉద్వేగాల నేపథ్యంలో...
ఏళ్ల తరబడి
పెనవేసుకొని ఉన్న మైత్రిని
నెమరేసుకోవడానికి...
మాటలు తడబడతాయిక!

—దాస్యం సేనాధిపతి